# నేటి వ్యవస్థలో రేపటి మనిషి

టి. సీతారాం

"వదినగారూ! ఓ వదినగారూ!!" పక్కింటి పార్వతమ్మని పిలుస్తున్న జయమ్మను చూసి చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తి చూసింది – ఎదురింటి వరండాలో వున్న కరుణ.

'ఇంకేం! ఎవరి కొంపో మునిగే ఉంటుంది. ఈమె వార్తలు వింటేచాలు" అనుకుంటూ మళ్ళీ పుస్తకంలోకి తలదూర్చింది కరుణ.

వాకిట్లోకి రావడమే తరువాయి జయమ్మ ప్రారంభోపన్యాసం మొదలు పెట్టింది. "మన విశాలాక్షి కూతురు నీలిమ లేదూ! ఆమెకు పెళ్ళి నిశ్చయించారా– పెళ్ళిపీటలమీద 'నాకీ పెళ్ళి వద్దు' అని రగడ చేసిందట. పరువు పోయిందన్న దిగులుతో ఈశ్వర్రావుగారు తలెత్తుకు తిరగలేక పోతున్నారు."

విషయాన్ని వినాలనే ఉత్సుకత కల్గింది కరుణలో కూడా. 'ఏ అవసరం మాకు లేదులే' అన్నట్లు కళ్ళు కూడా మనసును అనుసరించాయి పుస్తకంలో నుంచి తప్పుకొని.

"ఎందుకు వద్దందీ పెళ్ళి?" అడిగింది పార్వతమ్మ.

"కాలేజీ మాన్పించి ఆ పుత్రికా రత్నానికి చెప్పకుండా నిశ్చయించారట. బరితెగించింది కాకపోతే – పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులనే ధిక్కరిస్తుందా!"

"ఇదెక్కడి చోద్యమమ్మా.... ఈ వయసులో గుట్టుగా సంసారం చేసుకొని భర్తతో హాయిగా గడపాలిగాని." ఇది పార్వతమ్మ వ్యాఖ్యానం.

వాళ్ళ మాటలతీరు, నటభంగిమలను చూసి ఆ క్షణంలో అసహ్యం వేసినా మరుక్షణంలో కరుణలోని 'విచక్షణ' – 'జాలి'ని సరఫరా చేసింది.

'నీలిమ సంగతి నాకు తెలియదా! 'ఎప్పుడు డాక్టర్‌ని అవుతానా' అన్న దీక్షతోనే చదువు సాగిస్తుంది. ఈ ప్రాయంలోనే పెళ్ళి చేస్తే ఏం సాధించగల్గుతుంది? చాలా మంచిపని చేశావు నీలిమా!' అంటూ ఆమెను తలుచుకుంటున్న సమయంలో తన పెళ్ళి చూపుల రోజు గుర్తుకొచ్చింది కరుణకు.

"అమ్మా! పెళ్ళయిన తర్వాత నేనే అత్త వారింటికెందుకెళ్ళాలి? అతను మనింటి దగ్గర ఉండకూడదా?" ప్రశ్నలో స్వాభిమానం తొంగి చూసింది కరుణలో.

"ఆడెలా కుదుర్తుతుందమ్మా. పెళ్ళయిన తరువాత భర్త అధీనంలోనే ఉండాలి" జడ వేస్తున్న తల్లి సమాధాన మిచ్చింది.

"మరి నాకొచ్చే జీతంతో మిమ్మల్ని పోషించే అర్హత లేదా?" తనే ఏదో పోగొట్టుకుంటున్నట్లు దీనంగా అడిగింది కరుణ.

ఈ ప్రశ్నలు అడుగుతుంది కూతురులోని అమాయకత్వమో, మొండితనమో అర్థంకాలేదు. అయినా స్థిమితపడి "చూడమ్మా! స్త్రీకి ఎంత చదువున్నా - ఎన్ని సిరి సంపదలున్నా భర్తకు అణకువగా అతనికి యిష్టమైన రీతిలోనే నడుచుకోవాలి." అని కూతురికి జడవేయడం పూర్తిచేసి వంటింట్లోకి వెళ్ళింది.

తల్లి మాటలలోని అంతరార్థం గ్రహించింది. 'ఏమిటీ వ్యక్తులు? పరిస్థితుల మార్పు. కాలంలోని మార్పు గ్రహించి కూడా తమలో మార్పు తెచ్చుకోకుండా సంప్రదాయపు వలల్లోనే చిక్కుకుంటారు! నాన్నగారు రిటైర్ అయిపోయారు. అన్నయ్యకింకా ఉద్యోగం రాలేదు. రోజులు ఎలా గడుపుతారు? వీళ్ళని పోషించే బాధ్యత నాకు లేదా?' అన్న ఆలోచనలతో సతమతమయిన కరుణ 'ఈ పెళ్ళి చూపులనే తిరస్కరించాలి' అని దృఢంగా సంకల్పించుకుంది.

ఆ రోజు సాయంత్రం పెళ్ళిచూపులకు వచ్చిన వాళ్ళు నిందలువేస్తూ తిరిగి వెళ్ళిపోయారు.

"ఛీ.... ముదనష్టపుదానా! వచ్చిన మంచి సంబంధం తిరగ్గొట్టేశావు కదే! మళ్ళీ యింకొకరు నీముఖం ఎలా చూస్తారు? ఎవరిని ఉద్ధరిద్దామని పెళ్లి వద్దని పంపేశావు!" తండ్రికి సమాధానం చెప్పలేకపోయింది ఆ అభిమానవతి. ఏమైనా మాట్లాడితే కోపం మరింత ఎక్కువౌతుందని మౌనంగానే ఉండిపోయింది.

'నాన్నా' అన్న అన్నయ్య పిలుపు విన్న కరుణ — గత స్మృతిలో నుంచి తేరుకుని గదిలోకి వెళ్ళింది.

అన్నయ్య మనసులోని దైన్యం ఆ పిలుపులోనే వ్యక్తమయింది కరుణకు.

పడక్కుర్చీలో కూర్చున్న తండ్రి తలెత్తి "ఊఁ". అన్నాడు. "చెప్పవలసిందేదో చెప్పు" అన్నట్లున్నాయి అతని చూపులు. మనసులో నిండి ఉన్న బాధలు, సమస్యలు ఆ ముఖకవళికలే చెప్తున్నాయి.

"మూడు రూపాయలు కావాలి"

"ఎందుకు"

సమాధానం చెప్పే శక్తి లేదు శేఖర్‌లోని 'వ్యక్తి'కి.

"ఆ మధ్యనే యిచ్చాను" గుర్తు చేశాడు తండ్రి.

"అప్లికేషన్‌కి ఖర్చయిపోయాయి"

"అప్లికేషన్‌లకే డబ్బు తగలేస్తున్నావు కదరా! ఇన్నేళ్ళయింది నీ దరిద్రగొట్టు మొగానికి ఆ ఉద్యోగం ఎప్పుడొస్తుంది? ఏళ్ళు పైబడ్డాయి.... ఎందుకు? ఎదిగిన చెల్లెలికి పెళ్ళి చేయవలసింది పోయి దాని సంపాదన మీదే.... ఛీ, ఛీ.... వెధవ బ్రతుకు" ఆ తిట్లు శూలాల్లాగ తనకు కూడా తగుల్తున్నాయని ఎవరికి తెలుస్తుంది! "నా దగ్గర ఒక్క పైసా లేదు. కరుణనే అడుగు.... ఉన్నాయేమో" అంటూ కణతలు నొక్కుకుంటూ కళ్ళు మూసుకున్నారు.

తీరని అవమానం కల్గినట్లు బాధపడుతూ వీధిలోకి వెళ్ళిపోయాడు శేఖర్. కరుణ వరండాలోకి పరుగున వచ్చి "అన్నాయ్!" అంటూ నిండైన స్వరంతో పిలిచింది.

విననట్లు వెళ్ళిపోదామనుకున్నా ఆ పిలుపులోని ఆర్ద్రత, ఆప్యాయత కాళ్ళను గుమ్మం దగ్గిరే కట్టి పడేశాయి.

"నన్నడగడం నీ అభిమానాన్ని దెబ్బ తీస్తుందనే, డబ్బును బీరువాలో ఉంచుతున్నాను కదా! నీ అవసరాలకి తీసుకుంటావేమోనని...." అంటూ తన చేతిలోని ఐదు రూపాయల నోటును జేబులో కుక్కింది.

"పనికిరాని వెధవ, పనికిరాని వెధవ" అంటూ తండ్రి తిడ్తున్నట్లు అనిపించింది, షర్టు జేబులోని ఆ నోటుని చూసి. వెంటనే ఆ నోటును తీసి చెల్లెలి చేతిలో పడేసి వెళ్ళిపోయాడు శేఖర్.

ఈసారి చెల్లెలి పిలుపులోని ఆర్ద్రత అతనిని ఆపలేకపోయింది.

*

"ఏవండీ! భోంచేద్దురుగాని లెండి" పడక్కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న భర్తను పిలిచింది కామేశ్వరమ్మ.

కామేశ్వరమ్మది విచిత్ర మనస్తత్వం. ఆమెలో చైతన్యం ఏ కోశానా కనిపించదు. నిర్లిప్తంగా ఉంటుంది. ఇంట్లో ఎవరిమీద తను స్వయంగా సరియైన బాధ్యత తీసికొనకపోయినా, పరిస్థితులు చూసి అందరికంటే ఎక్కువ బాధనే అనుభవిస్తుంది. అణుచుకుంటుంది. కారణం, తండ్రి పెంపకం! భర్త అజమాయిషీ!!

భార్య పిలుపు విని తలెత్తారు రంగనాథం. "వాడు భోంచేశాడా?" నిరాశ ధ్వనించిందా కంఠంలో.

ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు కామేశ్వరమ్మకి.

మౌనంలో అంతరార్థం గ్రహించాడు రంగనాథం.

"మధ్యాహ్నం నుంచి రాలేదా?"

"వాడొస్తాడు లెండి, మీరు భోంచేయండి."

"ఫరవాలేదు వాడు రానీ యిద్దరం కలిసే భోంచేస్తాం" అని అన్నారే కాని 'వాడెందుకొస్తాడు? నా అసమర్థతని నేను నిరూపించుకుంటే వాడి పౌరుషం వాడు నిలబెట్టుకోవద్దూ?' అనుకుంటూ మనసులోని బాధను మనసులోనే అణుచుకున్నారు రంగనాథంగారు.

"నువ్వు రా అమ్మా భోంచేద్దువుగాని" ఏదో పత్రిక తిరగవేస్తున్న కూతుర్ని పిలిచింది.

"పదమ్మా!" అంటూ లేచింది కరుణ.

ఎన్ని బాధలు, సమస్యలు ఉన్నా కరుణ భరిస్తుంది—కాని క్రుంగిపోదు. ఏదో సాధించాలనే తపన, సాధిస్తాననే ఆత్మవిశ్వాసం ఆమెలో అడుగడుగునా వ్యక్తమవుతూనే వుంటాయి.

*

రోజూలాగే తెల్లవారినా, రోజూలాగ లేదు కరుణ మనసు. 'అన్నయ్య రాత్రి కూడ రాలేదు. ఏమిటి వాడి తత్త్వం! అన్నీ తెలిసిన వయసుకి ఎదిగి, ఏమీ తెలియనట్లు ప్రవర్తిస్తాడు!' ఆలోచిస్తున్న కరుణ అడుగుల చప్పుడు విని బయటికొచ్చింది.

"మధూ నువ్వా? రా లోపలికి" బయట నిల్చున్న మధును ఆహ్వానించింది. ఒకప్పుడు మధు, శేఖర్, కరుణ ఒక కాలేజీలోనే చదువుకొనేవారు.

"ఫర్వాలేదు. 'సెలూన్' కు వెళ్ళడానికి ఇటువైపు వెళ్తూ మీ యింటికి వచ్చాను," అని క్షణం ఆగి "చూడు కరుణా! మీ అన్నయ్య ఏదో తప్పు చేసినట్లు బాధ పడ్తున్నాడు. నిన్న రాత్రి నా దగ్గరికి వచ్చాడు. భోజనం చేయమంటే చేయలేదు. జ్వరం వచ్చినట్లుంది. నాకేం అర్థం గాక నీకు చెప్పవలసి వచ్చింది. నా రూమ్‌లోనే ఉన్నాడు," అని ముగించాడు.

కరుణ మనసు ద్రవించింది. కన్నీటి పొరలను దాచుకుంటూ "పద....వస్తున్నాను" అంటూ చెప్పులేసుకొని బయల్దేరింది.

"నేను సెలూన్‌కి వెళ్ళి వస్తాను – నువ్వెళ్ళు రూంకి"

పదినిముషాలలో రూమ్‌కి చేరుకుంది. తలుపు నెట్టి లోపలికివెళ్ళింది. మంచం మీద నిద్రపోతున్న అన్నయ్య దగ్గిరగా వెళ్ళి ప్రక్కన కూర్చుంది. నిద్రలోనైనా ప్రశాంతత లభిస్తుందా లేదా అని ముఖంలోకి చెమ్మగిల్లిన కళ్ళతో చూస్తూ నుదుటి మీద చేయి వేసింది.

చల్లని స్పర్శకు కళ్ళుతెరిచాడు. రోజూ తెల్లవారు ఝామున మొట్టమొదట కనిపించే చెల్లాయిని ఎదురుగా చూసేసరికి క్షణకాలం ఆనందం మనసులో మెదిలింది. లేచి నీరసంగా తల దించుకొనే కూర్చున్నాడు.

"ఏరా అన్నయ్యా! ఇంకా కోపం తీరలేదా?" మాటల్లో లాలన, కళ్ళలో మెరుపు కనిపిస్తున్నాయి. ఎవరితోనూ మాట్లాడలేనంత అవమానంతో క్రుంగిపోతున్నాడని గ్రహించింది కరుణ.

"చూడు అన్నాయ్! నీ మనసులో బాధ నాకు తెలుసు. 'ఆడది....అందులో చెల్లెలి సంపాదన మీద బ్రదకడం ఎంత హేయం' అంటూ అర్థం లేని ఊహలతో నిన్ను నువ్వే హీనపరుచుకుంటున్నావు. నన్ను కాలేజీలో చేర్పించడానికి



అమ్మా, నాన్నా ఒప్పుకోని సమయంలో నన్ను చదివించాలన్న నీ పట్టుదలే లేకపోతే నా పంతాలు, పట్టింపులు ఎవరిక్కావాలి? అలాగే నా ఉద్యోగం కోసం నువ్వు చేసిన కృషిని ఎలా మరిచిపోగలను?

కాలేజీలో కూడా డిబేట్సులో స్త్రీ స్వేచ్ఛ స్త్రీ స్వేచ్ఛ అంటూ ఉపన్యాసాలిచ్చే వాడివి. ఆ ఔదార్యం, ఆ అభ్యుదయం—ఇప్పుడు నీ చెల్లాయిని ఇంట్లో బాధ్యతగల ఒక వ్యక్తిగా గుర్తింపు తేలేకపోయాయా?"

"అదికాదు చెల్లాయి" అంటూ సతమతమవుతున్న అన్నయ్య ముఖంలోకి సూటిగా చూసింది కరుణ.

"నీ మనసెందుకలా మధన పడ్తుందో నాకు తెలుసు? అభ్యుదయం, అభ్యుదయం అంటూ సినిమా తెరమీద బొమ్మల్లాగ—సంఘంలో అభ్యుదయాన్ని చూడాలనుకుంటారు. కాని, మానసికంగా తమలో అభ్యుదయాన్ని తెచ్చుకోలేకపోతారు కొందరు బలహీనులు. వారిలో నువ్వొకడివి" అన్నయ్య ముఖంలో భావాలు ఎలా ఉంటాయో చూడ్డానికి ప్రయత్నించింది కరుణ.

"నా బాధ ఎవరి కోసమో నీకు అర్థం కాదు చెల్లాయి! నువ్వు యిలా పెళ్ళిచేసుకోకుండా....?

"ఎంతకాలం ఉంటావు అనంటావు. అంతేనా" అంటూ మధ్యలోనే అందుకుంది.

"తప్పకుండా చేసుకుంటాను. కాని, నేను కోరేది మూడుముళ్ళు వేసి స్వంతం చేసుకొనే వ్యక్తిని కాదు. పెళ్ళయినా పురుషుడిగా తన వారిని పోషించడానికి తనకు ఎటువంటి బాధ్యత ఉందో—స్త్రీగా నాక్కూడా నా వారిని పోషించడానికి అటువంటి బాధ్యత ఉందని గుర్తించే వ్యక్తి కావాలి. చేసుకొనే వివాహం నా వాళ్ళని, తన వాళ్ళని 'మనవాళ్ళు'గా గుర్తించే దృక్పథాన్ని ఏర్పరచాలి. ఒకరి అధీనంలో ఒకరు నడిచేటట్లు కాకుండా, ఇరువురి మధ్య స్నేహ, సాన్నిహిత్యాల్ని వృద్ధి చెందించేదిగా వుండాలి మా వివాహం" అంది ఆవేశంగా కరుణ.

ఆ ముఖంలో ఎన్నడూ లేని గాంభీర్యాన్ని చూసి "నువ్వు రేపటి వ్యక్తివి చెల్లాయి!" అని మనసులోనే మెచ్చుకొన్నాడు శేఖర్.

"బీరువాలో పూర్తిచేసిన అప్లికేషన్ పోస్టుచేసేశానురా. పద; ఇంక వెళ్దాం" అంటూ అన్నయ్య కళ్ళలోకి ఆప్యాయంగా చూస్తూ లేచింది కరుణ. ⌘